క్లుప్తంగా

సీసీరోడ్డు పనులు ప్రారంభం

తుగ్గలి: మండల పరిధిలోని గిరిగెట్లలో శనివారం చేపట్టిన సీసీ రోడ్డు పనులను సచివాలయ కన్వీనర్ విష్ణువర్ధనరెడ్డి ప్రారంభించారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులు రూ.10 లక్షలతో సీసీ రోడ్లు వేస్తున్నట్లు ఆయన చెప్పారు.

గ్రంథాలయం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

ఎమ్మిగనూరు టౌన్: స్థానిక గ్రంథాలయాన్ని శనివారం గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రకాష్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పాఠకుల హాజరు, వార, దిన పత్రికలు, పోటీ పరీక్షల మెటీరియల్ గురించి గ్రంథాలయ ఇన్‌చార్జ్ అధికారి హరికృష్ణను అడిగి తెలుసుకున్నారు

కోలుకోలేక యువకుడి మృతి



గోవర్ధన్(ఫైల్)

ఎమ్మిగనూరు రూరల్: వాంతులు, విరేచనాలతో బాధపడుతూ యువకుడు కోలుకోలేక శనివారం మృతిచెందాడు. వివరాలు.. మండల పరిధిలోని పార్లపల్లి గ్రామానికి చెందిన తెలుగు వెంకన్న, పద్మావతిల ఏకైక కుమారుడు గోవర్ధన్(18). తల్లిదండ్రులు తెలంగాణకు వలస వెళ్లటంతో గ్రామంలోనే గోవర్ధన్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజుల నుంచి వాంతులు, విరేచనాలు అవుతుండటంతో మందులు వేసుకుని ఇంట్లోనే ఉన్నాడు. తగ్గకపోవడంతో పాటు శనివారం మరింత తీవ్రం కావడంతో స్థానికులు గోవర్ధన్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. కుమారుడి మృతి చెందిన విషయాన్ని గ్రామస్తులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు.

స్టోన్ ప్లాంటేషన్ పకడ్బందీగా చేపట్టాలి



పనులు పరిశీలిస్తున్న తహసీల్దార్ నిత్యానందరాజు

నందవరం: భూ రక్ష- భూ హక్కు పథకంలో నిర్వహించిన సమగ్ర సర్వేలో భాగంగా స్టోన్ ప్లాంటేషన్‌ను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ నిత్యానందరాజు సూచించారు. శనివారం నాగలదిన్నె గ్రామ పరిధిలో హద్దుల వద్ద రాళ్ల ఏర్పాటు పనులను తహసీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేకు, రాళ్ల ఏర్పాటుకు రైతులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ జెర్మియా, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఫిష్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

గోనెగండ్ల: నవంబర్ 3, 4, 5 తేదీలలో కర్నూలులోని రావూరి గార్డెన్స్‌లో నిర్వహించే ప్రాన్స్ అండ్ ఫిష్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలని ఫిషరీస్ ఎఫ్‌డీఓ చంద్రయ్య కోరారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్‌తో కలిసి మత్స్యశాఖ అధికారులు ఫెస్టివల్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు ప్రభుత్వం ప్రవేశపట్టే పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో ఏఓ బాబు భాస్కర్, ఫిషరీస్ అసిస్టెంట్ అరుణకాంతి, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం



సన్మానం పొందిన విద్యార్థులు

దేవనకొండ: రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొన్న మండలంలోని గుండ్లకొండ జెడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులను శనివారం ఎంఈఓ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు అవసరమన్నారు. అనంతరం హెచ్‌ఎం ఆర్‌వీ నాగరాజు మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు జావీద్, ప్రవీణ్, రామ్‌చరణ్, సుస్మిత, నవనీత్(బ్యాడ్మింటన్), కార్తీక్(ట్రిపుల్ జంప్) ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు చత్తీష్‌ఘడ్ రాష్ట్రం బిలాయ్‌లో జరిగిన పోటీలలో పాల్గొనడం సంతోషకరమన్నారు. అనంతరం విద్యార్థులకు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.

నిర్మాణాలు పూర్తి చేయాలి

నందవరం: ప్రభుత్వ భవన నిర్మాణాలు వేగవంతం చేయాలని పీఆర్ ఏఈ జయన్న ఏజెన్సీ సభ్యులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని పెద్దకొత్తిలి గ్రామంలో రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు చివరి దశకు చేరుకున్నాయన్నారు. ఇప్పటి వరకు వివిధ నిర్మాణాల్లో ఉన్న భవన నిర్మాణ బిల్లులు చెల్లించామన్నారు.

వాల్మీకి జీవితం మానవాళికి ఆదర్శం

- పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి
- ఘనంగా వాల్మీకి జయంతి

వెల్దుర్తి (కృష్ణగిరి): గొప్ప కవిగా, మానవతావాదిగా ఎదిగిన రామాయణ మహాకావ్య రచయిత వాల్మీకి మహర్షి జీవితం ఆధునిక మానవాళికి ఆదర్శమని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. వెల్దుర్తి మండలం మల్లెపల్లె గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన మహర్షి జయంతి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు అనంతరెడ్డితో కలిసి సీతా రామలక్ష్మణులు, వాల్మీకి మహర్షి విగ్రహాలకు పూజలు నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయ మండపం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, వాల్మీకి నాయకులు శ్రీనివాసులు, నాగార్జున, గౌరయ్య, సిద్దన్న, గిడ్డయ్య, వెంకటేశ్వర్లు, అల్లుగుండు శ్రీరాంరెడ్డి పాల్గొన్నారు.

వెల్దుర్తిలో..

మండల కేంద్రంలోని పాతబస్టాండులోని వాల్మీకి విగ్రహానికి వాల్మీకి సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గోపినాథ్ నాయుడు, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ వెంకట్‌నాయుడు, హరిసింహనాయుడు, రామచంద్రుడు, వెంకట్రాముడు తదితరులు పూజాది కార్యక్రమాలు నిర్వహించి, పూలమాలలు సమర్పించారు.

- కృష్ణగిరి: మండలంలోని కోయిలకొండ గ్రామంలో వాల్మీకి జయంతి సందర్భంగా శనివారం నాయకులు వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం ఆయన చిత్రపటాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో వాల్మీకి నాయకులు సర్పంచ్ లక్ష్మిఈశ్వరయ్య, తలారి శంకరయ్య, గోవిందురాజులు, మాధవకృష్ణ, పెద్దయ్య, వలసల రామకృష్ణ, ఉంగరానిగుండ్ల సర్పంచ్ చిన్నమద్ది, దేవలంకాటి గంగిరాయుడు పాల్గొన్నారు.



వెల్దుర్తి మండలం మల్లెపల్లెలో ఆలయ మండపాన్ని ప్రారంభించి వాల్మీకి మహర్షికి పూజాది కార్యక్రమాలు నిర్వహించిన పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

- తుగ్గలి: వాల్మీకి జయంతి సందర్భంగా శనివారం తుగ్గలి, జొన్నగిరి, రాతన, పగిడిరాయి తదితర గ్రామాల్లో వాల్మీకి సోదరులు వాల్మీకి విగ్రహాలకు పూలమాలలు వేసి పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గుంత దేవి తదితరులు పాల్గొన్నారు.
- మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వాల్మీకి నాయకులు తిమ్మప్ప, శేఖర్, నాయుడు, చలపతి తదితరులు పాల్గొన్నారు.
- పత్తికొండటౌన్: పట్టణంలోని పాతబస్టాండు సమీపంలో ఉన్న వాల్మీకి రామాలయంలో జరిగిన జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాల్మీకి మహర్షి ఉత్సవ విగ్రహాన్ని పట్టణవీధులలో ఊరేగించారు. ఆలయ ఆవరణంలో అన్నదానం నిర్వహించారు. అలాగే పాతపేట తేరుబజారు వాల్మీకి ఆలయంలోనూ వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు టైలర్ రంగన్న, మసాల వీరేశ్, రామాంజనేయులు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



వెల్దుర్తి పాతబస్టాండులో వాల్మీకి విగ్రహానికి పూజలు నిర్వహించిన వాల్మీకి నాయకులు



కోయిలకొండలో వాల్మీకి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు



జొన్నగిరి వాల్మీకి విగ్రహం వద్ద పూజల్లో పాల్గొన్న సంఘం నాయకులు



మద్దికెరలో వాల్మీకి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న వాల్మీకులు

ఘనంగా వాల్మీకి జయంతి



ఎమ్మిగనూరులో వాల్మీకి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో శనివారం మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. స్థానిక వాల్మీకి సర్కిల్‌లో వాల్మీకి విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పోలయ్య, వెంకటాపురం వార్డు కౌన్సిలర్ బజారి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టా రంగయ్య, సునీల్‌కుమార్, కౌన్సిలర్ శివప్రసాద్ పాల్గొన్నారు. గంజిహళ్లి రోడ్డులో ఉన్న వాల్మీకి విగ్రహానికి వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి సీనియర్ నాయకుడు వీజీఆర్ కొండయ్య పూలమాల వేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు.

- గోనెగండ్ల: మండల కేంద్రంతో పాటు గోనెగండ్ల, పెద్దనేలటూర్, అలువాల, పుట్టపాశం తదితర గ్రామాల్లో వాల్మీకి జయంతి వేడుకలను వాల్మీకులు ఘనంగా నిర్వహించారు. పుట్టపాశంలో వాల్మీకి విగ్రహాన్ని గ్రామస్తులు ఆవిష్కరించారు. పుట్టపాశం గ్రామంలో రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ తెర్నేకల్ సురేందర్ రెడ్డి వేర్వేరుగా దర్శించుకుని పూలమాలలు వేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఎస్‌బీ మన్సూర్, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, సర్పంచ్ నరసింహ రెడ్డి, తెర్నేకల్ సర్పంచ్ అరుణ్ కుమార్, శేషాద్రి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పుట్టపాశంలో వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసిన రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్



వాల్మీకి విగ్రహానికి పూలమాలవేసిన జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ తెర్నేకల్ సురేందర్ రెడ్డి

- నందవరం: మండల కేంద్రంతో పాటు టి.సోమలగూడూరు, హాలహర్వి, ధర్మపురం, ముగతి, కనకవీడు, నాగలదిన్నె, ఇబ్రహీంపురం, నదికైరవాడి తదితర గ్రామాల్లో వాల్మీకి మహర్షి విగ్రహాలు, చిత్ర పటాలకు పూలమాలలు, టెంకాయలు సమర్పించారు. ఆయా గ్రామాల్లో వాల్మీకి మహర్షి చిత్రపటాలను ఊరేగింపు నిర్వహించారు. వాల్మీకి నాయకులు బజారి, నాగరాజు, ఈరన్న, ఉరుకుందు, డీలర్ వెంకటేష్, నరసరాజు, రాముడు, తిమ్మప్ప, నాగరాజు, రమేష్, నరసన్న, గోవిందు, చంద్రశేఖర్, రాముడు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి అడుగు జాడల్లో నడుద్దాం

ఆలూరు/హొళగుంద: వాల్మీకి మహర్షి అడుగు జాడల్లో నడుద్దామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం కో-ఆర్డినేటర్ నారాయణస్వామి, దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, ఆలూరు మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ, మంత్రి జయరాం తనయుడు ఈశ్వర్, ఆలూరు జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరు శేఖర్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంభీమ్‌నాయుడు, సిరుగుప్ప మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప అన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా శనివారం ఆలూరు, హొళగుందలో వాల్మీకి విగ్రహాలకు పూల మాలలు వేసి, పూజలు నిర్వహించారు. అనంతరం పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఆలూరు మండల అధ్యక్షుడు వీరేష, వాల్మీకి కులసంఘం నాయ కులు, బీసీ మాదన్న, అర్దగేరి శ్రీనివాసులు, వరుణ్, శ్రీధర్, గజ్జలప్ప, వెంకటేష్, రంగన్న, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు. హొళగుందతో పాటు వందవాగిలి, ఎల్లార్తి, పెద్దహ్యాట, కోగిలతోట, సుళువాయి తదితర గ్రామాల్లో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో వాల్మీకి సంఘం పెద్దలు సింగిల్ విండో చైర్మన్ వందవాగిలి మల్లికార్జున, పంపాపతి, దురుగప్ప, అడ్వకేట్ లక్ష్మీకాంత్, సిందువాళ కృష్ణయ్య, కోగిలతోట శేషప్ప, వెంకటేష్, తోక వెంకటేష్, రామకృష్ణ, హనుమప్ప, ఎల్లార్తి మల్లికార్జున, మేలగిరి, వెంకటేష్, సీతయ్య పాల్గొన్నారు.



ఆలూరులో వాల్మీకి విగ్రహం వద్ద కుల సంఘం నాయకులు



హొళగుందలో వాల్మీకి నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

- హాలహర్వి: మండల కేంద్రంతో పాటు నిట్రవట్టి, గూళ్యం తదితర గ్రామాల్లో వాల్మీకి జయంతిని కుల, మతాలకు అతీతంగా నిర్వహించారు. గూళ్యంలో యువతులు 101 కళశాలతో ఊరేగింపుగా తరలివచ్చి వాల్మీకి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు.
- ఆస్పరి: మండల కేంద్రంతో పాటు ముత్తుకూరు, బిణిగేరి, హలిగేర తదితర గ్రామాల్లో వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో శనివారం వాల్మీకి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆస్పరి, హలిగేర గ్రామాల్లో వాల్మీకి యూత్ ఆధ్వర్యంలో వాల్మీకి చిత్ర పటాన్ని ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో మండల సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన, సీఈఓ అశోక్, వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.
- దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో వాల్మీకి గుడిలో వాల్మీకి జయంతి వేడుకలను వాల్మీకి సోదరులు ఘనంగా నిర్వహించారు. వీఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున, వాల్మీకి నాయకులు చింతమాను మద్దిలేటి, దివాకర్‌నాయుడు, ఎల్లబోయే సుంకన్న, తలారి చింపి ఈరన్న, గొర్ల సుంకన్న పాల్గొన్నారు.



గూళ్యం గ్రామంలో 101 కలశాలతో యువతులు



కప్పట్రాళ్లలో వాల్మీకి విగ్రహ పూజా కార్యక్రమంలో పాల్గొన్న వాల్మీకి సోదరులు

- చిప్పగిరి: చిప్పగిరి, నగరడోణ గ్రామాల్లో నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకలలో ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు మారయ్య తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన గాజులపేట ఎద్దులు

తుగ్గలి: వాల్మీకి జయంతి సందర్భంగా జొన్నగిరిలో శనివారం నిర్వహించిన రాతి దూలం లాగుడు పోటీల్లో వైఎస్సార్ కడప జిల్లా దేశపు ఎద్దులు విజేతగా నిలిచాయి. ముందుగా పోటీలను బహుమతి దాతలు ప్రారంభించారు. పోటీలలో వైఎస్సార్ కడప జిల్లా గాజులపేట రమణయ్య ఎద్దులు విజేతగా నిలిచాయి. తర్వాతి స్థానాల్లో అదే జిల్లా పేరిన్నపాడు రామాంజినేయులు ఎద్దులు, అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం ఉద్యాళ బసన్న ఎద్దులు, ముత్యాల దివాకరరెడ్డి ఎద్దులు, చెట్నేపల్లి మహమ్మద్ ఆసరఫ్ ఎద్దులు, తుగ్గలి మండలం జొన్నగిరి ఎన్‌కే బుల్స్ జొన్నగిరి నరషింహులు ఎద్దులు నిలిచాయి. విజేతలైన ఎద్దుల యజమానులకు వరుసగా హనుమప్ప రూ.20 వేలు, పక్కీరప్ప రూ.15 వేలు, నాగేష్ సోదరులు రూ.15 వేలు, శివ రూ.8 వేలు, రామన్న రూ.5వేలు, పులికొండ రూ.5 వేలు, వెంకటరాముడు రూ.5 వేలు అందజేశారు.



జొన్నగిరిలో బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న హనుమన్న

పుట్టిన ఊరికి సేవ చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత



మట్టిని బిందెలోకి వేస్తున్న సొసైటీ ప్రతినిధులు

పత్తికొండ రూరల్: పుట్టిన ఊరికి సేవ చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నెహ్రూ యువ కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ రాహుల్‌రెడ్డి, తెలుగు పండితుడు రాజా జయచంద్రన్ అన్నారు. శనివారం పత్తికొండలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో యువ స్పందన సొసైటీ ఆధ్వర్యంలో 'మేరీ మాటీ-మేరీ దేశ్' కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ముందుగా విద్యార్థులతో నాభూమి-నాదేశం కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశం ఎంతో మంది మహనీయులకు పుట్టినిల్లు అని, వారి ప్రాణ త్యాగాలతోనే అందరూ స్వేచ్ఛగా జీవిస్తున్నామన్నారు. వివిధ ప్రాంతాల్లో సేకరించిన మట్టిని కలశంలోకి వేసి వీరుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో యువ స్పందన సొసైటీ అధ్యక్షుడు సురేంద్ర, ఉపాధ్యక్షుడు లక్ష్మన్న, హాస్టల్ వార్డెన్ నాగరాజు, వనం జయదేవ్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఆయుధాలపై అవగాహన

పత్తికొండ రూరల్: పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ప్రభుత్వ బాలుర హైస్కూల్ విద్యార్థులకు పోలీసుల ఆయుధాల వినియోగంతో పాటు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గోపాల్ పాల్గొన్నారు.

9 గంటల విద్యుత్ సరఫరా చేయాలి

హొళగుంద: వ్యవసాయానికి 9 గంటలు విద్యుత్ సరఫరా చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ కోరారు. శనివారం ఆయన హొళగుందలో సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, సీఐటీయూ నాయకులు నాగరాజుతో కలిసి విలేకరులతో మాట్లాడారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం

పత్తికొండటౌన్: స్థానిక కన్యకాపరమేశ్వరీ ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ముగ్గురికి గాయాలు

కృష్ణగిరి: మండల పరిధిలోని అమకతాడు టోల్‌ప్లాజా వద్ద శనివారం రాత్రి కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో హైదరాబాద్‌కు చెందిన స్నేహితులు సాహిల్, లఖన్, కైలాష్‌లు గాయపడ్డారు. హైవే పోలీసులు క్షతగాత్రులను కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

ఆర్‌బీకేల్లో పంట నమోదు జాబితా ప్రదర్శన

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండల వ్యాప్తంగా అన్ని ఆర్‌బీకేల్లో పంట నమోదు జాబితాలను సిద్ధంగా ఉంచామని మండల వ్యవసాయ అధికారి అక్బర్‌బాషా తెలిపారు. శనివారం ఆయన మండల పరిధిలోని రామళ్లకోట ఆర్‌బీకేలో పంట నమోదు జాబితాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల రైతులు సాగుచేసిన పంటలు, నమోదులో ఉన్న వాటిని సరిచూసుకోవాలని రైతులకు సూచించారు. ఏమైనా తప్పులుంటే వాటిని సరిచేసేందుకు అవకాశం కల్పిస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం

వెల్దుర్తి (కృష్ణగిరి): వెల్దుర్తి మండల కేంద్రంలో హజరత్ పెద్ద దస్తగిరిస్వామి గంధోత్సవం శనివారం రాత్రి భక్తిశ్రద్ధలతో సాగింది. నిర్వాహకుడు మహబూబ్‌బాషా గంధం తలకెత్తుకుని భాజాభజంత్రీల మధ్య సాగగా భక్తులు ఫాతేహాలు సమర్పించారు.

అవినీతికి పాల్పడితే చర్యలు

మద్దికెర: విద్యార్థులకు అందించే భోజనంలో అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని సమగ్ర శిక్ష బాలికల, చిన్నారుల అభివృద్ధి జిల్లా అధికారి సునీత హెచ్చరించారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రిన్సిపాల్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలపై శనివారం ఆమె విచారణ చేపట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. కొంత మంది అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు, పిల్లలకు అందించే మెనూ పరిశీలించి అవినీతి బయటపడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట ఎంఈఓ రంగస్వామి, మద్దికెర-2 ఎంఈఓ గోపాల్, దేవనకొండ ఎంఈఓ-2 విజయనిర్మల ఉన్నారు.

వైఎస్సార్ పెన్షన్ కానుకకు రూ.2.15 కోట్లు

తుగ్గలి: వైఎస్సార్ పెన్షన్ కానుక కింద నవంబరు నెల పింఛన్లకు మండలానికి రూ.2,15,07,250 విడుదలైంది. మండలంలో 7,775 పింఛన్లు ఉండగా.. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేసినట్లు ఎంపీడీఓ సావిత్రి శనివారం తెలిపారు. వచ్చే నెల1న గ్రామ వలంటీర్లు ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

పేదలకు వరం 'జగనన్న సురక్ష'

- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ టౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఆమె పరిశీలించారు. వైద్యాధికారులు శ్రావణి, అరుణ్ ఆధ్వర్యంలో పలువురికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. మెరుగైన వైద్యం, ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. ఎంపీపీ ఎం.నారాయణదాసుతో కలిసి ఎమ్మెల్యే శ్రీదేవి వివిధ స్టాళ్లను పరిశీలించారు. రోగుల వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. అందులో భాగంగానే ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు చేపట్టారన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యంగా జీవించాలని ఆమె ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎస్.నాగరత్నమ్మ, సర్పంచ్ కొమ్ముదీపిక, ఎంపీడీఓ కవిత, వక్ఫ్‌బోర్డు జిల్లా డైరెక్టరు టీఎండీ హుసేన్, మాజీ సర్పంచ్ సోమశేఖర్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగడు, మండల కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణగిరి: మండల పరిధిలోని ఆలంకొండ గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 486 మందికి వైద్య సేవలు అందించినట్లు వైద్యులు వరప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విశ్వమోహన్, ఐసీడీఎస్ సీడీపీఓ లూక, సూపర్‌వైజర్ శ్రీదేవి, వీఆర్వో విష్ణువర్ధన్ రెడ్డి, కార్యదర్శి సుంకన్న, ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

- వెల్దుర్తి మండలం రామళ్లకోట పీహెచ్‌సీ పరిధిలోని బుక్కాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 311 మందికి వైద్య సేవలు అందించినట్లు వైద్యులు అధికారులు తెలిపారు.



శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

దేవనకొండ: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ తెర్నెకల్ సురేందర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. శనివారం మండలంలోని తెర్నెకల్ గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. వైద్యబృందం డాక్టర్ అతావుల్లా, కళ్యాణ్, పుష్ప తదితరులు 600 మందికి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ అరుణ్‌కుమార్, ఎంపీటీసీ నమ్మాలా శీను, మాజీ ఎంపీటీసీ ఈరన్న, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ మెంబర్ వాల్మీకి రాఘవేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు వీరన్న తదితరులు పాల్గొన్నారు.

- ఆస్పరి: మండలంలోని యాటకల్లు గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 346 మందికి వైద్య సేవలు అందించినట్లు డాక్టర్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. డాక్టర్లు కల్పన, మాధవీలత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సీడీపీఓ నిర్మలాదేవి పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుధమ్మ పాల్గొన్నారు.
- హొళగుంద: మండలంలోని కోగిలతోటలో సర్పంచ్ యాట గురుపాదమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో హొళగుంద, గజ్జహళ్లి పీహెచ్‌సీ డాక్టర్లు న్యూటన్, బింధుమాధవి, రాధ, లక్ష్మీకాంత్‌రెడ్డి, చంద్రశేఖర్‌తోపాటు వైద్య సిబ్బంది హాజరై 382 మందికి వైద్య సేవలు అందించారు. 18 మందిని మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేసినట్లు డాక్టర్ న్యూటన్ తెలిపారు.



ఆలంకొండలో బీపీ పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది



పౌష్టికాహార స్టాళ్లను పరిశీలిస్తున్న తెర్నెకల్ సురేందర్‌రెడ్డి

- ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కడివెళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో పలువురు డాక్టర్లు హాజరై ప్రజలకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బంగారమ్మ, సర్పంచ్ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.
- గోనెగండ్ల: మండలంలోని అలువాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని వైస్ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి పరిశీలించారు. డాక్టర్లు ఇమ్రాన్‌ఖాద్రీ, దుర్గా విజయశ్రీ, రంగరవళి, కార్తీక్‌లు శిబిరానికి వచ్చిన ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ మనోహర్ రెడ్డి, సర్పంచ్ బాషా, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సోమేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


తప్పల్లేని ఓటరు జాబితా సిద్ధం

ఆలూరు రూరల్: నియోజకవర్గంలో తప్పులు లేని ఓటరు జాబితాను సిద్ధం చేసినట్లు ఆలూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లికార్జు తెలిపారు. శనివారం ఆయన స్థానిక ఎంపీడీఓ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్ఓ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. శుక్రవారం విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే నవంబర్ 4, 5, డిసెంబర్ 2, 3 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాల్లో మరోసారి దరఖాస్తులు ఇవ్వాలన్నారు. వచ్చే ఏడాది జనవరి 5న తుది ఓటరు జాబితా విడుదల చేస్తామన్నారు. అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ రామాంజనేయులు, ఎన్నికల డీటీ గుండాల్ నాయక్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ బసన్న గౌడ్ పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధే లక్ష్యం

- ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సహకారంతో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం 23వ వార్డులో రాధాకృష్ణ కాలనీకి వెళ్లేందుకు రూ.25 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి రిలయన్స్ ట్రెండ్స్ వద్ద మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వార్డు ఇన్‌చార్జ్ తరుణ్‌రెడ్డిలతో కలిసి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి పైప్‌లైన్లు, సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ నీరజ, ఏఈ శరత్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు బుట్టా రంగయ్య, టౌన్‌బ్యాంక్ చైర్మన్ యుకె రాజశేఖర్, పార్టీ అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, కౌన్సిలర్ శివప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు రంగన్న, శ్రీను,వీరేష్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి